ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 27 ఆగస్టు 2025



పారదర్శకంగా అభివృద్ధి

ఓదెల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా నియోజక వర్గంలో పారదర్శకంగా అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. బాయమ్మపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు, అబ్బిడిపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రేంసాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సుమన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాహుల్ ,నాయ కులు గుండేటి ఐలయ్య, రాజు, సాంబమూర్తి, శంకర్, పాల్గొన్నారు.

కొలువుదీరనున్న ఆదిదేవుడు

- నేడు వినాయక చవితి

పెద్దపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవాల సందడి మొదలైంది. తొలిపూజలు అందుకునే గణపయ్యను కొలువు తీరేలా సర్వాంగ సుందరంగా మండపాలను సిద్ధం చేశారు. పట్టణాల నుంచి పల్లెల వరకు తొమ్మిది రోజుల పాటు భక్తులు వినాయక సంబురాలలో మునిగితేలనున్నారు. బుధవారం ప్రారంభమయ్యే వినా యక సందడికి పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ముందుకు రావడంతో ఆశావాహుల సహకారంతో మరింత జోరుగా, ఉత్సాహంగా యువకులు వేడుకలు జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. తీరొక్క రూపాలతో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడానికి భక్తులు ఏర్పాట్లు చేశారు.



మంథనిలో వినాయకుడిని ఊరేగింపుగా తీసుకొస్తున్న నిర్వాహకులు

వేదాలకు అది స్వరూపమైన ఓంకార రూపమే గణపతిగా భావిస్తారు. పంచభూతాలకు సంకేతంగా వినాయకుడు పూజలు అందుకుంటాడు. మేధస్సు, సంపదనిచ్చి విఘ్నాలను తొలగించే వినాయకుడి పుట్టిన రోజును వినాయక చవితిగా జరుపుకుంటాం. బాద్రపద చవితి నాడు వచ్చే ఈ పర్వదినాన్ని గణేశ చతుర్థి, వినాయక చతుర్థి అని పిలుస్తారు. శుభా శుభకర్మల్లో వినాయకుని పూజించని కార్యక్రమం ఉండదు. ఆనందోత్సాహాలతో జరు పుకునే ఈ పండుగను బుధవారం జరుపుకోనున్నారు.

- నవరాత్రుల ఆవిర్భావం...

గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. తొ మ్మిది రోజుల అనంతరం ఊరేగింపుల మధ్య వినాయక విగ్రహాలను తీసుకువెళ్ళి నదులు, సముద్రాలు, జలాశ యాల్లో నిమజ్జనం చేస్తారు. ఎవరికి వారు ఈ పండు గను ఇళ్ళలో జరుపుకోవడం చాలాకాలం నుంచి వస్తున్నప్పటికీ, హైందవ జాతిని జాగృతం చేయడానికి శివాజీ పాలనా కాలంలో సామూహిక పర్వదినంగా రూపుదిద్దుకుంది. తర్వాత బ్రిటీష్ పాలనలో అణగారిన జాతిని మేల్కొల్పడానికి స్వాతంత్ర్య సమర యోధుడు బాల గంగాధర్ తిలక్ తొమ్మిది రోజులు జరుపుకునే లా సాంప్రదాయాన్ని పునరుద్ధరించారు.

మట్టి గణపతిని పూజించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. వన మహోత్సవంలో పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పాఠశాలలోని విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాలను కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి గణపతులను పూజించాలని ఆయన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, ఏఈ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినాయక చిత్రం ఉన్న బ్యాగును బహుకరిస్తున్న విద్యార్థిని


- మట్టి విగ్రహాలనే పూజించాలి

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) మట్టి విగ్రహాలను పూజించి పర్యవరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే చింతకుంటవిజయరమణారావు పిలుపునిచ్చారు. జండా చౌరస్తాలో మంగళవారం మున్సిపాల్టీ ఆధ్వర్యంలో మట్టి గణపతుల ప్రతిమల ఉచిత పంపిణీ కార్యక్రమానికి

(మిగతా 8వ పేజీలో)

పంటల సాగుపై డిజిటల్ సర్వే

- రెండు రోజుల్లో ఆరంభం కానున్న సర్వే
- క్షేత్ర స్థాయిలో పర్యటించనున్న ఏఈవోలు
- రైతులు, పంటలు, సాగు విస్తీర్ణం వివరాలు నమోదు
- పంచాయతీల్లో రైతులు, పంటల వారీగా వివరాల ప్రదర్శన



డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా రైతుతో కలిపి ఫొటో తీస్తున్న ఏఈవో (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వ్యవసాయ శాఖాధికారులు, విస్తీర్ణాధికారులు ఇక పొలం బాట పట్టనున్నారు. వానాకాలం సీజన్‌లో రైతులు ఎంత విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగు చేశారనే విషయమై డిజిటల్ సర్వే చేయనున్నారు. సర్వే వెంటనే ఆరంభించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ నుంచి సర్వే ఆరంభించనున్నారు. వాస్తవానికి మంగళవారం నుంచే ఆరంభం కావాల్సి ఉన్నప్పటికీ, డిజిటల్ క్రాప్ సర్వే యాప్ సాంకేతిక కారణాల వల్ల సర్వర్ పని చేయలేదు. జిల్లాలో ఈ సీజన్‌లో 2,76,076 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, వివిధ రకాల పంట లను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖాధి కారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 2 లక్షల 60 వేల ఎకరాల్లో వరి, పత్తి సాగు చేశారు. ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. జిల్లాలో ఈ సీజన్‌లో ఆలస్యంగా వర్షాలు పడిన కారణంగా పంటల సాగు కూడా ఆలస్య మయ్యింది. జిల్లాలో 1,61,032 మంది రైతులు పట్టా భూములు కలిగి ఉన్నారు. ఇందులో 2.5 ఎకరాల వరకు 1,24,730 మంది రైతులు, 2.5 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు 28,297 మంది రైతులు, 5 నుంచి 10 ఎకరాల వరకు 6,222 మంది రైతులు, 10 నుంచి 25 ఎకరాల వరకు 744 మంది రైతులు, 25 ఎకరాలకు పైగా భూములు కలిగిన రైతులు 39 మంది ఉన్నారు. సాగు భూములు 2 లక్షల 80 వేల ఎకరాల వరకు ఉన్నాయి. రైతులు ప్రతి సీజన్‌లో ఏ పంటలను సాగు చేస్తున్నారనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా పంటల సర్వే చేస్తున్నది. ఇందుకోసం ఒక యాప్‌ను రూపొందించింది. జిల్లాలో 54 క్లస్టర్లు ఉండగా, వాటి పరిధిలో 54 మంది వ్యవసాయ విస్తీర్ణాధికారులు పని చేస్తున్నారు. పంటలు సాగు చేసే సమయం పూర్తి కావడంతో ప్రభుత్వం సర్వేకు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సర్వేతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా డిజిటల్ క్రాప్ సర్వే చేయిస్తున్నది. డిజిటల్ క్రాప్ సర్వే చేయాలంటే తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. పొలాల వద్దకు వెళ్లి పంటలను రైతుతో కలిసి ఫొటోలు తీసి రైతు వివరాలు, సర్వే నంబర్, పట్టాదారు పాసు పుస్తకం నంబర్, సాగు చేస్తున్న పంట, విస్తీర్ణం వివరాలు నమోదు చేసి అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత సర్వే వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చే యాలి. పంటల సాగు వివరాలు నమోదు చేయడం వల్ల రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేందుకు దోహదపడతాయి. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తులను విక్రయించేటప్పుడు తప్పుడు వివరాలు నమోదు చేయకుండా ఉంటుంది. ఉదాహరణకు ప్రభుత్వం సన్న రకం వరి సాగు చేసే రైతులకు క్వింటాలు ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించింది. డిజిటల్ క్రాప్ సర్వేలో ఒక రైతు తాను పండించిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఎంత విస్తీర్ణంలో సన్నరకం వరి పంట వేశారో, తద్వారా ఎంత దిగుబడి వస్తుందో, అంతకు మాత్రమే బోనస్ చెల్లిస్తారు. అక్రమాలకు తావు లేకుండా ఉపయోగ పడనున్నది. అలాగే పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకునేందుకు దోహద పడనున్నది. అక్టోబర్ నెలాఖరు వరకు సర్వేను పూర్తి చేయనున్నారు.

ప్రభుత్వ అసమర్థతతోనే యూరియా కొరత



సహకార సంఘం కార్యాలయం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ పాలనతోనే తెలంగాణలో యూరియా కొరత వచ్చిందని మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి రాస్తారోకో ధర్నా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతను తీర్చాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ యూరియా కొరత రాలేదని, ఇప్పుడు రైతులు చెప్పులు క్యూలో పెట్టే రోజులు వచ్చాయని మండిపడ్డారు. రైతులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఏర్పడిన యూరియా కొరతకు కాంగ్రెస్, బీజేపీలు బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా కొరతను నివారించి రైతులను ఆదుకోవాలని ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతాంగం యూరియా కొరతతో అల్లాడుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై మరొకరు నెపం నెట్టుకుంటూ చోద్యం చూస్తున్నారని విమర్శించారు. సహకార సంఘం కార్యాలయాల వద్ద రైతులు బారులు తీరుతున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. గోపు ఐలయ్యయాదవ్, ఆముల నారాయణ, బొడ్డుపల్లి శ్రీనివాస్, రవి, శివరాత్రి గంగాధర్, కరివేద శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

జూలపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటనను పురస్కరించుకుని జూలపల్లికి వచ్చిన జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ యూరియా కొరత ఉందనే ప్రచారంతో రైతులు తమ నిల్వ చేసుకోవడంతో చిన్న సన్నకారు రైతులకు యూరియా దొరకడం లేదన్నారు. గత సంవత్సరం కంటే ఇప్పటి వరకే 2960 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అధికంగా ఇచ్చామన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో సెప్టెంబర్ 3న ఉత్పత్తి ప్రారంభం అవుతుందని, అనంతరం జిల్లా రైతు లకు అవసరానికి కావలసిన యూరియా లభిస్తుందన్నారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం నుంచి జిల్లాలోని సన్నచిన్నకారు రైతులకు మాత్రమే 1, 2 బస్తాలను వ్యవసాయ విస్తరణ అధి కారుల సూచన మేరకు యూరియా అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

జూలపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అబ్బాపూర్‌లో మంగళవారం ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన ప్రతి కుటుంబానికి అందిస్తామని, అలాగే ఇంటి నిర్మాణాలకు ఉపయోగించే ఇసుకను లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పూర్తిచేస్తున్న లబ్ధిదారులు దశలవారీగా ఇంటి బిల్లులను పొందేందుకు గ్రామాల్లో కార్యదర్శులను, పట్టణాల్లో వార్డు ఆఫీసర్లకు వివరాలను అందించాలని సూచించారు. అలాగే అర్హత ఉండి ఇల్లు మంజూరు కాని పేదప్రజలు ఆందోళన చెందవద్దని విడుతల వారీగా అందరికి ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గండు సంజీవ్, తహసీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపిడిఓ పద్మజ, నాయకులు దండె వెంకటేశం, మానుమండ్ల శ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్నకుమారి



జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రస న్న కుమారీ పేర్కొన్నారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తు తం 32 స్కానింగ్ కేంద్రాలు పని చేస్తున్నాయని, ప్రతీ స్కానిం గ్‌కు సంబంధించి ఫారం ఎఫ్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన ట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, ప్రోత్సహిం చిన వారికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధిస్తామని తెలిపారు. ప్రతీ నెల స్కానింగ్ సెంటర్లను కార్యాలయ సిబ్బంది బృందంతో తనిఖీ చేస్తామన్నారు. అబార్షన్ జరిగే ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌తో సమన్వయం చేసుకుంటూ అబార్షన్ మాత్రల అమ్మకాలపై పర్యవేక్షణ చేయాలని అధికారులను సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్, ఎంహెచ్ఎస్ డాక్టర్ బి. వాణిశ్రీ,పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవీందర్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఫాతిమా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు కే రాజగోపాల్, డెమో వెంకటేశ్వర్లు, సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

బయో వ్యర్థాల నిర్వహణ చేయని ఆసుపత్రులపై చర్యలు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ ఏరియాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్‌లకు బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై మునిసిపల్ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జీ అన్నా ప్రసన్న కుమారి సమావేశం నిర్వహించారు. ఆసుపత్రులలో బయో జీవవ్యర్థాల నిర్వహణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010 ప్రకారం, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యందే బాధ్యత అన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి పొందిన వెంకట రమణ ఇన్సినిరేటర్ ఏజెన్సీ ద్వారా ఈ వ్యర్థాలను డిస్పోజ్ చేయాలన్నారు. ఇందుకు రెడ్, బ్లూ, ఎల్లో రంగుగల బిన్‌లను వాడాలని, పంక్చర్ ప్రూఫ్ కంటైనర్లను కూడా నిడిల్స్, పగిలిన ఇంజక్షన్ గాజు ముక్కలు వేయడానికి వాడాలన్నారు. ఏజెన్సీతో టై అప్ రిజిస్ట్రేషన్ గడువు మూడు నెలల ముందే ఫీజు చెల్లించి రిన్యూవల్ చేసుకోవాలన్నారు. ఏజెన్సీ వాహనాలను ట్రాక్ చేయుటకు ట్రాకింగ్ వివరాలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారికి ఇవ్వాలన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ డస్ట్‌బిన్‌లలో వేయకూడదన్నారు. అలా వేస్తే మున్సిపల్ సిబ్బందికి, ప్రజలకు ఇన్ఫెక్షన్ సోకే అవకాశాలు ఉన్నాయన్నారు. వెంకట రమణ ఇన్సినరేటర్స్ ఏజెన్సీ నుంచి పాల్గొన్న సతీష్ బయోమెడికల్ వ్యర్థాలను ఎలా వేరు చేయాలో వివరించారు. ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, డెంటల్ క్లినిక్‌లు, స్కానింగ్ కేంద్రాల డాక్టర్స్ యాజమాన్యం, సిబ్బంది, వెంకటరమణ ఇన్సినరేటర్స్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర తాగునీటి సరఫరాకు కార్యాచరణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో రోజు తాగునీటి సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష మున్సిపల్ అధికారులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో 30 రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిత్యం తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నల్ల నీరు వృథాగా వదిలే వారి కనెక్షన్ తీసివేయాలని, కొత్త విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఓపెన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండకుండా చూడాలని సూచించారు. నిత్యం ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయాలని, రెండు నెలల్లో పూర్తి స్థాయిలో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బహిరంగంగా రోడ్డు పై చెత్త వేసే వారికి భారీ జరిమానాలు విధించాలని కలెక్టర్ ఆదేశించారు. రోజు పట్టణంలో ఫాగ్గింగ్ చేయాలని, వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాటు చేయాలని, మండపాల సమీపంలో పరిశుభ్రత పాటించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, ఏఈ సతీష్ అధికారులు, పాల్గొన్నారు.

బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అంబరి కిషోర్ ఝా

పాలకుర్తి,ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం పరిశీలించారు. స్టేషన్ పరిసరాలతోపాటు రిసెప్షన్ సెంటర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, వారికి సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. పోలీస్టేషన్ పరిధి, ముఖ్యమైన ప్రదేశాలు, నేరాలు, వాటి నియంత్రణ అంశాలను తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు.

బాధితులకు నమ్మకం, భరోసా కలిగించే విధంగా ప్రవర్తించాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా ఉంటూ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్యలపై, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకొని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చేయాలని ఆదేశించారు. సీపీని పోలీస్ సిబ్బంది సన్మానించారు. డీసీపీ పుల్లా కరుణాకర్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐఆర్ స్వామి,సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు బెదిరింపులు

● పోలీస్‌స్టేషన్‌లో ఉండగానే గుర్తుతెలియని వ్యక్తి ఫోన్




పోలీస్‌స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌కు గుర్తుతెలియని వ్యక్తి (9440473303) ఫోన్ చేసి చంపుతామని బెదిరించాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాకకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నల్ల సతీష్ మంగళవారం తన ఆటో నడుపుకుంటూ కరీంనగర్‌కు వస్తున్నాడు. కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం వద్ద కొందరు ఆటోను నిలిపి సతీష్‌పై దాడి చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై సామాజిక మాధ్యమంలో పోస్టులు పెడుతావా? అంటూ ఆగ్రహంతో కొట్టారు. మళ్లీ అలాంటి పోస్టులు పెడితే చంపుతామని బెదిరించారు. ఈ ఘటన తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ బాధితుడిని కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. లిఫ్ట్ చేయగానే 'నీవు బీఆర్ఎస్ కార్యకర్త సతీష్‌ను తీసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్తావా? నీవు చొప్పదండి నియోజకవర్గంలోని ఊర్లలో తిరిగితే చంపుతాం. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మీడియాలో తిడితే బతుకనీయం' అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీనిపై సుంకె రవిశంకర్ కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడారు. తనకు ఫోన్ చేసిన వ్యక్తి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోదరుడినని, ఏ గ్రామానికీ వెళ్లనీయబోమని, దాడి చేసి చంపుతామని బెదిరించి నట్లు చెప్పారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడిగా నల్ల సతీష్ చురుకుగా ఉన్నందుననే దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. సతీష్‌పై దాడి చేసినవారిపైనా, తనకు ఫోన్ చేసి చంపు తానని బెదిరించినవారిపైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు ఫిర్యాదులు అందాయని, విచారణ జరుపుతున్నామని సీఐ సృజన్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు ఉన్నారు.

కంప్యూటర్ కోర్సు.. భవితకు ఉషస్సు

● ఈ ఏడాది నుంచే కేజీబీవీల్లో ఇంటర్ స్థాయిలో ప్రారంభం

● వృత్తి విద్యతో ఉపాధి, ఉద్యోగాలకు అవకాశం



కంప్యూటర్‌పై ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థినులు

కథలాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత డిజిటలైజేషన్, గ్లోబలైజేషన్ పరిస్థితుల్లో బాలికలకు ఇంటర్ స్థాయిలోనే కంప్యూటర్ సైన్స్‌లో నైపుణ్యం పెంచి స్వయం ఉపాధి, ఉద్యోగాల కల్పనకు అవకాశం ఇచ్చేందుకు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల్లో కొత్త కోర్సు ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు పాఠశాల



కస్తూర్బాగాంధీ విద్యాలయం

స్థాయిలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో ఇంటర్మీడియేట్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ వాటిలో వొకేషనల్ కోర్సులను 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ బోర్డు అమలు చేయాలని నిర్ణయించింది. బాలికలకు రెండేళ్ల కాలపరిమితతితో కంప్యూటర్ కోర్సులపై పట్టు సాధించేలా సిలబస్‌ను రూపొందించారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు కోర్సు పూర్తి కాగానే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుంది.

● ఐదు మండలాల ఎంపిక

బాలికల్లో కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలను పెంచడానికి జిల్లాలో ప్రభుత్వం కథలాపూర్, మేడిపల్లి, ధర్మపురి, మల్లాపూర్, మల్యాల మండలాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసింది. ఇంగ్లీష్ సబ్జెక్ట్‌తో పాటు కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాలతో సిలబస్ రూపొందించి ఒక్కో పాఠశాలకు 40 మందిని చేర్చుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఇంగ్లీష్, కంప్యూటర్ బోధనకు ఉపాధ్యాయులను కూడా నియమించారు. ఏడు కంప్యూటర్లు, ఫర్నిచర్ సరఫరా చేసి బోధన చేస్తున్నారు. కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, ఎంఎస్ ఆఫీస్, వెబ్ డిజైనింగ్, డాటా బేస్ మేనేజ్‌మెంట్ సిస్టం, డాటా కమ్యూనికేషన్, కంప్యూటర్ నెట్‌వర్క్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సీ ప్లస్, జావా, ఎక్సెల్ వంటిని విద్యార్థినులకు నేర్పిస్తున్నారు. ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేసి కంప్యూటర్‌పై ప్రాక్టికల్‌గా నేర్పించే ప్రక్రియ కొనసాగుతోంది. రాబోయే ఏళ్లలో డిజిటల్ ప్లాట్‌ఫాంలో గ్రాఫిక్, యానిమేషన్, కాన్ఫిగరింగ్ సిస్టమ్, ప్రింటింగ్ మరియు పబ్లిషింగ్, డిజైనింగ్‌ల్లో సాంకేతికత పెరగడానికి దోహదం చేయనుంది. ఇంటర్‌నెట్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో పుష్కలంగా నైపుణ్యాలు పెంచుకునేందుకు అవకాశం చిక్కనుంది. ప్రభుత్వ విభాగంలో జూనియర్ ప్రోగ్రామర్, కంప్యూటర్ ఆపరేటర్, సాఫ్ట్‌వేర్ మార్కెటింగ్ పర్సనల్, నెట్‌వర్కింగ్ టెక్నిషియన్స్ పోస్టులు, స్వయం ఉపాధిలో డీటీపీ ఆపరేటర్, ఇంటర్‌నెట్, ఈమెయిల్ సెంటర్స్, ఇమేజ్ అండ్ వీడియో ఎడిటింగ్, హార్డ్‌వేర్, ట్రబుల్ షూటింగ్ టెక్నిషియన్స్, డాటాబేస్ నిర్వాహణ, నెట్‌వర్క్ కనెక్షన్స్ వంటివి ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉండనుంది.

కోర్సుపై ఆసక్తితో చేరాను

- శృతి, విద్యార్థిని



కంప్యూటర్ కోర్సులో చేరాలనే ఆసక్తి ఎప్పటి నుంచో ఉంది. అయితే ప్రభుత్వం కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి కంప్యూటర్ కోర్సు ప్రవేశపెడుతుందని తెలిసి అడ్మిషన్ తీసుకున్నా. వర్డ్, ఎక్సెల్, జావా, వెబ్ డిజైనింగ్ వంటి అంశాలను ఇప్పటికే ల్యాబ్‌లో ప్రాక్టికల్‌గా నేర్చుకున్నాం. అన్నిరంగాల్లో కంప్యూటర్ సాధారణమైన నేపథ్యంలో భవిష్యత్ బాగుంటుందని తల్లిదండ్రులు, బంధువులు చెప్పారు.

రాబోయే రోజుల్లో భారీ డిమాండ్

- వాసాల లావణ్య, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ



రానున్న రోజుల్లో కంప్యూటర్ ప్రొఫెషనల్స్‌కు భారీ డిమాండ్ ఉండనున్న నేపథ్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన సీఎస్‌సీ కోర్సు బాలికలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటర్‌స్థాయిలో ప్రవేశపెట్టిన ఈ కోర్సుతో కంప్యూటర్ సైన్స్‌పై నిష్ణాతులు కావడానికి ఆస్కారం ఉంది. వొకేషనల్ విభాగం రూపొందించిన సిలబస్‌తో అనేక అంశాలపై పట్టు సాధించనున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

మానకొండూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారులోని బ్రిడ్జిపై మంగళవారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సు చెడిపోవడంతో మరమ్మతుల కోసం హుజూరాబాద్ వైపు నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా బస్సును కరీంనగర్ నుంచి వరంగల్ వైపుకు వెల్లుతున్న లారీ బ్రిడ్జిపై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు వెనకాల ధ్వంసమైంది. బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మంథనిరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టుపల్లి గ్రామానికి చెందిన రైతు గడ్డి లింగయ్యకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్ తో సోమవారం సాయంత్రం మృతి చెందింది. గ్రామ శివారులోకి ఎద్దును మేతకు తీసుకు వెళ్ళగా ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు లింగయ్య కోరాడు. మృతి చెందిన ఎద్దు విలువ రూ. 80 వేలు ఉంటుందని తెలిపారు.

రెండు కార్లు ఢీకొని నలుగురికి గాయాలు

మల్యాల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. కొండగట్టుకు చెందిన రంగు నర్సింహులు తన భార్యతో కలిసి హైదరాబాద్ నుంచి వస్తుండగా జగిత్యాల నుంచి వస్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులోని నర్సింహులు, విజయ, జగిత్యాల కు చెందిన అడువాల లక్ష్మణ్‌తో పాటు మరొకరికి గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందు భాగాలు దెబ్బతిన్నాయి.

సెల్‌ఫోన్‌ల అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పట్టుకున్న పోలీసులు మంగళవారం వాటిని యజమానులకు అప్పగించారు. కరీంనగర్‌కు చెందిన అల్లాడి విజయ్, వై.మల్లారెడ్డి కొద్ది రోజుల కిందట ఫోన్‌లు పోగొట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లో ఫోన్‌లు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి యజమానులకు అప్పగించారు.

కుటుంబ కలహాలతో కార్మికుడి ఆత్మహత్య



వేముల కరుణాకర్(ఫైల్)

తంగళ్లపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన వేముల కరుణాకర్(42)అనే పవర్‌లూం కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పురుగుల మందు తాగి వచ్చి ఉదయం ఇంట్లో అపస్మారక స్థితిలో ఉన్న కరుణాకర్‌ను చూసిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి కరుణాకర్ మృతిచెందడాని తెలిపారు. కాగా మృతుడు తన భార్యతో గొడవపడి నాలుగు సంవత్సరాలుగా ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కుతురు, కుమారుడు ఉన్నారు.

స్వశక్తి మహిళలకు నాణ్యమైన చీరలు

● త్వరలో నేత కార్మికులకు రూ. 33 కోట్ల రుణమాఫీ

● విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ సానుకూల నిర్ణయం

● చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

● సిరిసిల్లలో నేతన్నలకు త్రిఫ్ట్, బీమా చెక్కుల పంపిణీ

● స్వశక్తి చీర ఆవిష్కరణ

సిరిసిల్ల ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):మహిళలకు గౌరవంగాఉండేలా నాణ్యమైన చీరలు తయారు చేయాలని ఒక్క చీరపై రూ 480 ఖర్చు చేస్తూ 65 లక్షల మంది మహిళా సంఘాల సభ్యు లకు రెండు చీరలు చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు తెలిపారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కే కన్వెన్షన్ హాల్లో నేతన్న పొదుపు(త్రిఫ్ట్), నేతన్న బీమా పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఇదే సందర్భంలో దసరాకు స్వ శక్తి మహిళలకు అందించే ఏకరూప చీరలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జౌళి శాఖ మంత్రిత్వ కార్యదర్శి శైలజా రామయ్యార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతంలో నేతకార్మికుల పేరు చెప్పి పనికి రాని చీరలు ఎక్కడెక్కడి నుంచో వచ్చా యన్నారు. అలా కాకుండా మహిళలు పెట్టెలో దాచుకొని వాడుకొనే విధంగా నాణ్యమైన చీరలు అందిస్తామన్నారు. రైతు లకు రుణమాఫీ చేసినట్లే నేత కార్మికుల రుణాలను క్యాబినెట్‌లో చర్చించి త్వరలోనే మాఫీ చేస్తామన్నారు. నేతన్నలకు సంబం ధించి రుణమాఫీ చేయడానికి నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. ఈ మేరకు రూ.33 కోట్ల రుణాలు ఉన్నట్లు లెక్కలు తేలాయని తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో కార్మికులకు ఖర్చుపెట్టి బాకీ పడ్డ రూ వెయ్యి కోట్లు విడతలవారీగా తీర్చామన్నారు. కార్మికులు కోరినట్లు క్యాబినెట్లో చర్చించి రూ 33 కోట్ల రుణమాఫీ చేసే బాధ్యత తమది అని స్పష్టం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గతంలో ఏం జరిగిందో.. ఇప్పుడు ఏం జరుగుతుందో గమనించాలన్నారు. ఈ నియోజక వర్గ ఎమ్మెల్యే పదేళ్ల పరిశ్రమలు, చేనేత జౌళి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో చెల్లించకపోయిన బకాయిలు చెల్లించామని, ఇప్పుడు విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ కోసం ఉత్తరం రాశాడన్నారు. క్యాబినెట్లో చర్చించి బ్యాక్ బిల్లింగ్‌పై పరిశ్రమకు సహకారం అందే విధంగా సానుకూల నిర్ణయం చేస్తామని హామీ ఇచ్చారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2500 మెట్రిక్ టన్నుల నూలు 100 సొసైటీలకు సరఫరా చేశామని వెల్లడించారు. నేతన్న చేయూత, నేతన్న పొదుపు, నేతన్న బీమా వంటి అనేక పథకాల బకాయిలను జమ చేస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఉచిత ప్రయాణానికి రూ 6680 కోట్ల చెల్లించిందని, మహిళలకు 200 కోట్ల జీరో టికెట్లు జారీ చేశామన్నారు. వస్త్ర పరిశ్రమలు ఆధునిక సాంకేతికతను పెంచేందుకు హ్యాండ్లూమ్ యూనివర్సిటీ (ఐఐహెచ్‌టి) ఏర్పాటు చేశామని అన్నారు.



స్వశక్తి చీరను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కవ్వంపల్లికి బండి సంజయ్ పరామర్శ



నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే రెండో సోదరుడు కవ్వంపల్లి రాజేశం అనారోగ్యంతో మరణించారు. మంగళవారం కరీంనగర్ వాల్మీకినగర్‌లోని నివాసంలో పలువురు నాయకులు కవ్వంపల్లిని కలిశారు. బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అంబటి బాలేష్‌గౌడ్, టీడీపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతి ఉన్నారు.

ఒంటరితనంతో వృద్ధుడి ఆత్మహత్య

చందుర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనంతో ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పల్ల లస్మయ్య(80) అనే వృద్ధుడు ఒంటరితనం భరించలేక మండల కేంద్రం శివారులోని ఓ రైతుకు చెందిన గుడిసెలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య గత కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న లస్మయ్య కొంత కాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడి కోసం చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఓ రైతు పొలం వద్దకు వెళ్లేసరికి ఉరి వేసుకుని కనిపించాడు. సదరు రైతు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి కుమారుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జె. రమేష్ తెలిపారు.

మహిళ అదృశ్యం

తంగళ్లపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామానికి చెందిన అంకం పూజ(25) అదృశ్యమైంది. ఈ నెల 13వ తేదీ నుంచి పూజ కనిపించకుండా పోయిందని తల్లి అంకం రమ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పూజకు బద్దనపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌తో మూడు సంవత్సరాల క్రితం పెళ్లి జరిగింది. ఈ నెల 3వ తేదిన తంగళ్లపల్లిలోని తల్లి గారింటికి వచ్చిన పూజ 13వ తేదీ నుంచి పూజ కనిపించకుండా పోయిందని, ఇప్పటివరకు ఆచూకీ లభ్యం కాలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేణికుంటలో గల మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా, ఎలాంటి అనుమతులు లేకుండా కొత్తపల్లి గ్రామానికి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం ఎల్ఎండి పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు చెందిన బోయిని తిరుపతి, బుర్ర అంజయ్య ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

కరీంనగర్ క్రైం : కరీంనగర్ రూరల్ మండలం శివారులోని గొల్లపల్లి వాగు నుంచి అనుమతి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న డ్రైవర్ దర్శనాల మల్లేశ్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

తప్పుడు డాక్యుమెంట్లతో స్థలం కాజేసే యత్నం

● ముగ్గురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తప్పుడు డాక్యుమెంట్లతో కరీంనగర్‌లోని రాఘవేంద్ర నగర్‌లో స్థలాన్ని కాజేయాలని ప్రయత్నించిన కేసులో నిందితులు కొండూరి శ్రీనివాస్, మాడక వర్షిత్ కుమార్ అలియాస్ బంటి, జగదీష్‌ఠాకూర్ అలియాస్ జగ్గను మంగళవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించి ఎనిమిది మందిపై చీటింగ్ కేసు నమోద కాగా ముగ్గురిని అరెస్టు చేశామని, మిగతా వారి కోసం విచారణ కొనసాగుతోందని తెలిపారు. కోర్టు ఆదేశాలతో నిందితులను జైలుకు తరలించామని పేర్కొన్నారు.

గోదావరిఖనిలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కోల్‌సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అశోక్‌నగర్‌లో నివాసముండే ఇంటర్ విద్యార్థిని కాంపెల్లి అక్షర(17) మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అక్షర ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్షర ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనకు కారణాలు తెలియరాలేదు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

గంభీరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఈనెల 21న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువ రైతు రాయలింగు సతీష్(35) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన సతీష్ తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. పంట దిగుబడి తగ్గడంతో పోషణ భారంగా మారింది. దాంతో ఎనిమిది నెలల కిందట రూ.8 లక్షలు రుణం తీసుకుని వరి కోత యంత్రం కొనుగోలు చేశాడు. యాసంగి సీజన్‌లో రూ. లక్ష బాకీలు చేసి పంటను వేశాడు. నీరు లేక పంట ఎండిపోయి చేతికందకుండాపోయింది. మూడు నెలల కిందట రూ.లక్ష అప్పులు చేసి బోరు వేయించాడు. ఓ వైపు బాకీల బాధలు.. మరో వైపు కుటుంబ పోషణ భారంగా మారడంతో మనస్థాపం చెందిన సతీష్ ఈనెల 21న పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు

● ఇందిరమ్మ ఇళ్ల పేరుతో రవాణా

తిమ్మాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన మట్టి, మొరం అవసరం మేరకు అనుమతి తీసుకొని రవాణా చేసుకునే వెలుసుబాటు కల్పించింది. తిమ్మాపూర్ మండలంలో దీన్ని కొందరు అసారాగా చేసుకొని ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇష్టరాజ్యంగా మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

రాత్రి వేళ టిప్పర్లతో మొరం డంపులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 నుంచి 5గంటల వరకే అనుమతి తీసుకున్న చోటు నుంచి మొరం తరలించాలి. కానీ కొందరు అక్రమార్కులు రాత్రి వేళల్లో టిప్పర్లతో మొరం తరలిస్తూ డంపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. పగలు ట్రాక్టర్లతో మొరం, మట్టి విక్రయిస్తున్నారు. ఎవరైనా అడిగితే ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేస్తున్నామని చెపుతున్నారు.

దిగువ మానేరు జలాశయం నుంచి ప్రస్తుతం కరీంనగర్‌లోని మానేర్ రివర్ ఫ్రంట్‌కు రెండు లక్షల క్యూబిక్ మీటర్లు, తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని మోయతుమ్మెద వాగులోకి పూడికతీత పనులకు 10వేల క్యూబిక్ మీటర్ల మొరం తవ్వుకునేందుకు ఇరిగేషన్ శాఖ నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్‌లకు అనుమతి ఇచ్చింది. మొరం తవ్వకాలపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో మొరం టిప్పర్ల ద్వారా పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి సమయంలో దిగువ మానేరు జలాశయం నుంచి పదుల సంఖ్యలో టిప్పర్లతో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఖాళీ ప్రదేశాలలో డంపులుగా నిల్వ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా డ్యామ్ కట్ట పరిసరాలల్లో ఇష్ట రీతిలో తవ్వకాలు జరుపుతుండటంతో డ్యాం లోపల పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది.

పట్టించుకోని అధికారులు

రాత్రింబవళ్లు మొరం తరలిస్తున్నా, జనావాసాల మధ్య బారీగా మొరం డంపులు ఏర్పాటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మట్టి ట్రాక్టర్లు రోడ్డుపైనే యథేచ్ఛగా తిరుగుతున్నా పట్టించుకొనే వారు లేకుండా పోయారు. ప్రభుత్వ ఖజానకు గండి కొడుతూ డ్యాం, ఇతర ప్రదేశాల నుంచి తరలుతున్న మొరంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా రాత్రి సమయంలో మొరం అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని అంటిదేమైనా ఉంటే నిఘా పెట్టి వాటిని పట్టుకొని వారిపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.



అలుగునూర్ మానేరునగర్‌లో నిల్వ చేసిన మొరం, మట్టి



ఎల్ఎండీలోని ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో డంప్ నుంచి తరలిస్తున్న మొరం

బద్దిపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లాపాపలను, పాడిపంటలను చల్లంగా చూడమ్మా.. అంటూ భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని వేడుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. రెండు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు ఆలయంలోకి చేరుకుని అమ్మవారికి పట్నాలువేసి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. అనంతరం అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. బేతాళుడు, రాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అల్లీపూర్ విద్యార్థిని

రాయికల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని టి.అనూష షాట్‌పుట్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జగిత్యాల జిల్లాలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి ఈ నెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పొరండ్ల కిరణ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని పీడీ కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు అభినందించారు.

మిర్చి నారు C/O ఉప్పట్ల



- గతంలో ఏపీలోని గుంటూరు నుంచి కొనుగోలు
- రైతులకు వ్యయప్రయాసలు
- నారు సాగుతో పలువురికి ఉపాధి

మంథనిరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతంలో మిర్చి పంటను సాగు చేస్తారు. గతంలో ఇక్కడి రైతులు ఆంధ్ర ప్రాంతంలోని గుంటూరు వెళ్ళి మిర్చి నారు తీసుకు వచ్చి ఇక్కడ సాగు చేసేవారు. గుంటూరు వెళ్ళి నారు తెచ్చుకోవడం వ్యయప్రయాస కావడంతో ఇక్కడే నారు తయారీ చేస్తున్నాడు మండలంలోని ఉప్పట్లకు చెందిన పోగుల తిరుపతి అనే రైతు. ఇరవై సంవత్సరాలుగా మిర్చి పంట సాగు చేస్తున్న తిరుపతి నారు కోసం రైతులు పడుతున్న కష్టాలు చూశాడు. రవాణా, ఆర్థిక భారం తగ్గించాలని ఆలోచన చేసి మిర్చి నారు పెంపకం పై దృష్టి పెట్టాడు. గ్రామంతో పాటు పరిసర గ్రామాలైన పోతారం, గుంజపడుగు, మిలోచవరం గ్రామాలలో రైతులు మిర్చి పంట అధికంగా సాగు చేస్తారు. రైతులకు రవాణా ఖర్చులతో పాటు, మిర్చినారుకు అధిక డబ్బులు అవడం, తీసుకు వచ్చినా నారు పాడై పోతుండటంతో ఇక్కడే నారు పెంచడం ప్రారంభించాడు. మిర్చి సాగు చేసే రైతులు విత్తనాలు తీసుక వస్తే వాటిని అలికి నారు అయ్యే వరకు పెంచుతాడు. ఇందుకు ప్యాకెట్‌కు రూ.350 నుంచి 400ల చొప్పున డబ్బులు తీసుకుంటాడు. సుమారు 45 నుంచి 50 రోజుల వరకు మిర్చినారు నాటే స్థాయికి వస్తుంది. ఇలా విత్తనాలను అలికి నారును ఇస్తుండటంతో రైతులకు ఉపయోగకరంగా ఉంది. ఉప్పట్లలోనే నారు లభిస్తుండడంతో రైతులకు భారం తగ్గింది. దీంతో పాటు నాణ్యమైన విత్తనాలను ఎంచుకునే అవకాశం లభించింది. గతంలో గుంటూరు నుంచి తీసుకు వచ్చిన నారు ఎలాంటిదో తెలియక రైతులు అనేక సార్లు నష్టపోయిన సందర్భాలున్నాయి. మిర్చి నారు పెంచుతున్న తిరుపతితో పాటు 10 నుంచి 15 మంది కూలీలకు ఉపాధి దొరుకుతుంది.

ఈ సంవత్సర పంటకు నారు సిద్ధం చేస్తున్న..



- పోగుల తిరుపతి, రైతు ఉప్పట్ల

ఈ సంవత్సరం వారం, పది రోజులలో మిర్చి నాట్లు ప్రారంభమవుతాయి. ఇందుకు రైతుల కోసం వంద ఎకరాలకు సరిపడే మిర్చి నారు సిద్ధం చేస్తున్న. ఆరు సంవత్సరాలుగా రైతుల కోసం మిర్చి నారు పెంచుతున్నా. రైతులు తమకు ఇష్టమైన విత్తనాలు తీసుకవస్తే అలికి నారు సిద్ధం చేసి ఇస్తా. నాతో పాటు మరి కొందరు కూలీలు ఉపాధి పొందుతున్నారు.

ఆర్టీసీ కార్మికుల సంబరాలు



క్షీరాభిషేకం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

భగత్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యలు పరిష్కరించిందని ఆర్టీసీ కార్మికులు మంగళవారం కరీంనగర్-2 డిపో ఎదుట సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ(ఐఎన్‌టీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జక్కుల మల్లేశం మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. 2017 పే స్కేలు, 2013 బాండ్ డబ్బులు, డీఏలు, సీసీఎస్ రుణాల డబ్బుల చెల్లించడంతోపాటు రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిందన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి టీఆర్ రెడ్డి, రీజినల్ అధ్యక్షుడు ఎన్‌కే రాజు, నాయకులు ఖాద్రీ, రజనీకుమార్, ఖలీం, సంపత్, శ్రీధర్, కెఆర్‌రెడ్డి, శేఖర్, రిటైర్డ్ ఉద్యోగులు ఇసాక్, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు

భగత్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగులకు మంగళవారం అధికారులు ప్రగతిచక్ర అవార్డులు అందజేశారు. ఉత్తమ బస్‌స్టేషన్‌లుగా వేములవాడ, హుజూరాబాద్ ఎంపికయ్యాయి. 2024-25, 2025-26 సంవత్సరానికి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన 26 మందికి కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్.భూపతిరెడ్డి, పి.మల్లేశం, డిపో మేనేజర్లు ఎం.శ్రీనివాస్, ఎం.రవీంద్రనాథ్, పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ ఎ.శంకరయ్య, బి.సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు, లారీ ఢీ

- ఏడుగురికి స్వల్ప గాయాలు

తంగళ్లపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో మంగళవారం రాత్రి లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో సిరిసిల్లకు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో బస్సు డ్రైవర్ దుబ్బాకకు చెందిన తలారి స్వామితో పాటు ఆరుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సీఐ మొగిలి, ఎస్ఐ ఉపేంద్ర చారి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురి బైండోవర్

కథలాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని చింతకుంటలో అటవీ శాఖకు చెందిన ఎకరం భూమిలో చెట్లు నరికివేసి బ్లేడ్ ట్రాక్టర్లతో ధ్వంసం చేసిన ఐదుగురిని సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి ముస్తాక్ అలీ తెలిపారు. సూరి వెంకటేశ్, లావుడ్య రాజేశ్, లావుడ్య రమేశ్, బోదాసు రాజు అనే వ్యక్తులు మూడు బ్లేడ్ ట్రాక్టర్లతో చదును చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాటిని పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఆగమశాస్త్రం ప్రకారం రాజన్న ఆలయ అభివృద్ధి

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ● రాజన్న ఆలయ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆగమశాస్త్ర ఆధారంగా ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేపడుతామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మంగళవారం ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులపై ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి వివరించగా, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ వెంకటరావు, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి ప్రణాళికను భక్తులకు, ప్రముఖులకు పారదర్శకంగా తెలియజేశామన్నారు. రాబోయే రోజులలో పెరిగే భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకుని రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి ప్రణాళికలను డీజీపీఎస్, డ్రోన్ సర్వే ఆధారంగా తయారు చేశామని తెలిపారు. మహాశివరాత్రి, సమ్మక్క సారలమ్మ జాతర వంటి సమయాల్లో పార్కింగ్ సమస్య ఉత్పన్నం కాకుండా జగిత్యాల రోడ్డు వైపు 20 ఎకరాలు ముందుగానే గుర్తించి పెట్టామన్నారు. చారిత్రాత్మక ప్రాధాన్యత, పౌరాణిక ప్రాధాన్యత ఉన్న ఉప ఆలయాలు యధావిధిగా కొనసాగుతాయని, ఆలయ విస్తరణ అభివృద్ధి పనులను ఆగమశాస్త్రం ప్రకారం చేపడుతాని, శృంగేరి పీఠం అనుమతితో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పక్కా ప్రణాళిక తయారు చేశామన్నారు. ఆలయ విస్తరణ 4 నుంచి 6 ఎకరాలలో ఉంటుందని, మాస్టర్ ప్లాన్ డెవలప్‌మెంట్ ఏరియా 33 ఎకరాల వరకు ఉంటుందన్నారు. ఆలయ విస్తరణలో షాపులు కోల్పోయే వారికి భవిష్యత్తులో కేటాయించేందుకు హరిహర షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.110 కోట్లకు టెండర్లు పిలిచామని, వీటిలో ఆలయ విస్తరణకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత కింద రూ.76 కోట్లు, అన్నదాన సత్రం నిర్మాణానికి రూ.35 కోట్లు కేటాయించాన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెండవ విడత రూ.285 కోట్లు కేటాయిస్తామన్నారు. అనంతరం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం ప్రణాళికను తెలియజేస్తూ ప్రజలకు ఉన్న సందేహాలు అపోహలను తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, దేవాదాయ శాఖ సలహాదారు గోవింద్‌హరి, ఆలయ ఇన్‌చార్జి ఈవో రాధాబాయి, బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్



ఆలయ విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్ వివరిస్తున్న ఆర్కిటెక్ట్

దర్గా బయటకు మార్చేందుకు ఆలోచన చేయాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ

వేమలవాడ రాజరాజేశ్వర స్వామివారి శైవక్షేత్రంలో ఉన్న దర్గాను ఆలయం బయటవైపు మార్చేందుకు మరోమారు ఆలోచన చేయాలని అధికారులను బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కోటిలింగాలను వేరే చోటుకు మార్చే విధంగానే ఆలయంలో ఇరుకుగా ఉన్న దర్గాకు కొంత స్థలం కేటాయించి బడ్జెట్ పెట్టి ఆలయం బయట ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్ దృష్టికి తీసుకువెళ్లారు.

33 ఎకరాల్లో రాజన్న ఆలయ అభివృద్ధి

- మాస్టర్ ప్లాన్, నమూనా చిత్రాలతో వివరించిన ఆర్కిటెక్ట్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని మొదటి దశ అభివృద్ధి పనులపై మంగళవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్, నమూనా చిత్రాలను చూపిస్తూ పట్టణ ప్రజలకు ఆయా పార్టీల నాయకులకు వివరించారు. ప్రస్తుతం రాజన్న ఆలయ 4 నుంచి 6 ఎకరాల విస్తరణంలో ఉండగా సుమారు 33 ఎకరాల్లో రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం నాలుగు గోపురాలతో 540 ఫీట్ల పొడవు, 37 ఫీట్లతో ప్రాకారాలు నిర్మించనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవీ స్టేషన్(భక్తుల పికప్‌డ్రాప్), అన్నదానం, ప్రసాదం తయారీ కేంద్రం, వీఐపీ గెస్ట్‌హౌస్, శివార్చన వేదిక, కల్యాణకట్ట, నూతనంగా నిర్మించే భక్త ధర్మగుండంతో పాటు పలు కట్టడాలను నిర్మిస్తున్నట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

వేములవాడ రాజన్న ఆలయంలో ప్రముఖుల పూజలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఆలయ అభివృద్ధిపై జరిగిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, స్థపతివల్లి నాయగం, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో రాధాబాయి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



పూజలో పాల్గొన్న ఆది శ్రీనివాస్, శైలజా రామయ్యర్, కలెక్టర్

జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు తరలిన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచి కిక్ బాక్సింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటడానికి మంగళవారం తరలివెళ్లారు. గత నెలలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో పతకాలను సాధించి జాతీయ స్థాయి పోటీలకు జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు శివేష్, అనంద్, యుతిక, స్వేదిక, అజాన్ ఎంపికైన్నారు. బుధవారం నుంచి ఆదివారం వరకు తమిళనాడు రాష్ట్రం చెన్నై నెహ్రూ స్టేడియంలో జరగనున్న జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు మాస్టర్ వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐదుగురు క్రీడాకారులు తరలివెళ్లారు.



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులు

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 20,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు వదులుతున్నారు.

రామడుగు : రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి ఒక్క పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీరు గ్రావిటీ కెనాల్‌కు వెళ్తోంది.

మిడ్ మానేరులోకి..

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 16,800, గాయత్రి పంప్ హౌస్ నుంచి 3150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఎల్ఎండికి ఆరు గేట్లను మీటరు పైకెత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 17.683 టీఎంసీల నీరు ఉంది.

ఎల్ఎండీలోకి...

తిమ్మాపూర్ : ఎల్ఎండీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా మంగళవారం సాయంత్రానికి 10.689 టిఎంసీలకు చేరింది.

అన్నపూర్ణలోకి ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.

సెప్టెంబర్ 15లోగా చీరల ఉత్పత్తి ఆర్డర్ పూర్తి చేయాలి

● చేనేత జౌళీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్



మాట్లాడుతున్న చేనేత జౌళీ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యార్



కార్యక్రమంలో పాల్గొన్న వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అందించిన చీరల ఉత్పత్తి ఆర్డర్‌ను సెప్టెంబరు 15వ తేదీలోగా పూర్తిచేయాలని చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ సూచించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అందజేసే ఏకరూప చీరల ఉత్పత్తిపై మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన బాధ్యులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమ బాధ్యులకు కేటాయించిన ఆర్డర్, వారు ఉత్పత్తి చేసిన అంశాలపై చర్చించారు. ఉత్పత్తిలో చాలా వెనుకబడిన వారి వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం శైలజారామయ్యార్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు ఏకరూప చీరలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని వెల్లడించారు. ఈ చీరల ఉత్పత్తి ఆర్డర్‌లో భాగంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు వస్త్ర ఉత్పత్తి ఆర్డర్ కేటాయించామని వివరించారు. 4.30 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్ ఇచ్చామని, ఇప్పటి దాకా దాదాపు 50 శాతం పూర్తి అయిందని వెల్లడించారు. మిగతా ఆర్డర్‌ను వచ్చేనెల 15వ తేదీలోగా ఇవ్వాలని స్పష్టం చేశారు. దానికి అనుగుణంగా పరిశ్రమ బాధ్యులు పవర్ లూమ్‌లు, కార్మికులు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసుకొని, ఎట్టి పరిస్థితుల్లో లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఉత్పత్తిలో వెనుక బడిన వారు తమ ఆర్డర్ పూర్తి చేయని పరిస్థితుల్లో మిగతావారికి దానిని అందిస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమ బాధ్యుల వద్ద ఉన్న వస్త్రాన్ని వెంటనే గోదాముకు తరలించాలని సూచించారు. దీంతో మిగతా ప్రక్రియ వేగంగా పూర్తి అవుతుందని వెల్లడించారు. ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా చీరలు పంపిణీ చేసే అవకాశం ఉంటుందన్నారు.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు నిరంతరం ప్రభుత్వ ఆర్డర్లు అందించేందుకు సర్కార్ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలోని యంత్రాలను ఆధునికీకరించాలని పేర్కొన్నారు. దీంతో మార్కెట్‌తో పోటీ పడే అవకాశం ఉంటుందని, మరిన్ని ఆర్డర్లు వస్తాయని తెలిపారు. వస్త్ర పరిశ్రమ బాధ్యులు ఆలోచన చేయాలని సూచించారు. వస్త్ర పరిశ్రమ ఆర్డర్లకు సంబంధించిన బిల్లులు త్వరలోనే అందించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వస్త్ర పరిశ్రమకు సంబంధించిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, జీఎస్టీ తదితర సమస్యలను పరిశ్రమ బాధ్యులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో టెస్కో సీజీఎం ఎన్‌వీ రావు, చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు, అధికారులు పాల్గొన్నారు.

జనహితయాత్రకు తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ చేపట్టిన జనహితయాత్రకు రాజకీయాలకతీతంగా ప్రజలు తరలివచ్చారని, వారందరికీ పాదాభివందనం చేస్తున్నానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే ఆరు గ్యారంటీలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ప్రజప్రభుత్వంగా నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు సన్నబియ్యం, ఉచిత బస్సు, 200 యూనిట్ల విద్యుత్, వరికి రూ.500 బోనస్, 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా, 25 లక్షల రైతు =లకు 21 కోట్ల రూపాయల రుణమాఫీ, కొత్త రేషన్‌కార్డులను అందించి రికార్డు సృష్టించిందన్నారు. ఒక్క వ్యవసాయానికే లక్షా 2 వేల కోట్లు ఖర్చుచేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల, రైతుల పక్షపాతిగా పాలన సాగిస్తుందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిపనులపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర చేశారని అన్నారు. స్వచ్ఛందంగా వేలాది ప్రజలు తరలి వచ్చి మద్దతు పలికినందుకు వారికి తన చర్మం ఒలిచి చెప్పులు కుట్టిచ్చినా తక్కువేనన్నారు. తాను బతికున్నంత వరకు నియోజకవర్గ ప్రజలకు సోదరుడిగా అండగా ఉంటానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పులి ఆంజనేయులు, రవీందర్, రాజిరెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రైతులకు సరిపడా యూరియా నిల్వలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పంటలకు యూరియా అందిస్తూ రైతులకు సహకార సంఘం అండగా నిలుస్తోందన్నారు. ఈ సీజన్‌లో ఇబ్బందులు కలగవద్దని ముందస్తు ప్రణాళికతో యూరియా అందజేసి రైతుల అవసరాలను తీరుస్తున్నామన్నారు. గతేడాది 11,872 బస్తాలు విక్రయించగా, ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు 13,741 బస్తాలు విక్రయించినట్లు పేర్కొన్నారు. రైతులు ఎక్కువగా సహకార సంఘంపైనే ఆధారపడుతున్నారని, వారి అవసరాలకు అనుగుణంగా యూరియాను అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు రావని మండల పంచాయతీ అధికారి ఆరీఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం కాల్వశ్రీరాంపూర్, పందిళ్లలో వార్డులను పరిశీలించారు. రహదారులకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంపలను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల కారణంగా విష జ్వరాలు వచ్చి ఇబ్బందులకు గురవుతారని సూచించారు. కార్యదర్శులు మహేందర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నానో యూరియా బహుళ ప్రయోజకారి

ఎలిగేడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నానో యూరియా బహుళ ప్రయోజనకారి అని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి అన్నారు. మంగళవారం రైతు వేదికలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నానో యూరియా 4 శాతం నత్రజనికి బదులుగా, నానో యూరియా ప్లస్ 20 నత్రజని అందుబాటులోకి వచ్చిందన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియా ప్లస్‌ను వరిలో రెండో దఫాగా, ఇతర పురుగు మందులతో కలిసి వాడితే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. దీంతో పత్రహరితం, కిరణజన్య సంయోజక క్రియ సామర్థ్యం, పంటల దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు. యూరియా కంటే తక్కువ ధర, రైతులకు తక్కువ ఖర్చు, నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. ఎకరానికి 500 మిల్లీలీటర్ల నానోయూరియాను పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఈఓలు గణేష్, సురేష్, శరణ్య ఉన్నారు.

పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యంపై ఫిర్యాదు

మంథని, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో అమృత్2.0 కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న పనులపై అధికారుల పర్యవేక్షణ లేదని ఈఈకి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నేత ఎడ్ల సదాశివ్ మంగళవారం తెలిపారు. వివిధ వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పై పర్యవేక్షణ లేని కారణంగా కాంట్రాక్టర్ కనీస నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. అభివృద్ధి పనులు జరుగుతున్న తీరు పై అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య పరీక్షలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మణిజ్యోతి క్లినిక్ వైద్యుడు కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ సన్‌రైజ్ ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసీజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. వైద్యుడు కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అప్పన్నపేట సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు ముగింపు నిర్వహించారు. కబడ్డీ, ఖో ఖో , వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన బాల, బాలికలకు బహుమతులను అందజేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. మండల విద్యాధికారి సురేంద్రకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల పీఈటిలు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం..



ఎలిగేడులో మట్టి గణపతులతో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని మంగళవారం కృష్ణవేణి పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మట్టి గణపతులను తయారు చేసి పూజ చేశారు. వినాయకుడి వేషధారణలో విద్యార్థి ఆకట్టుకున్నాడు. పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో మార్కండేయకాలనీలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులు శ్రేయస్కరమని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గంద్ర దేవేందర్‌రావు అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎకోక్లబ్ ఆధ్వర్యంలో సైన్స్ టీచర్ అరుణ కుమారి విద్యార్థులతో మట్టి గణపతులను తయారు చేయించి పంపిణీ చేశారు. గణపతులను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులు అందించారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): జీడినగర్ ప్రాంతంలోని యూనివర్సల్ పాఠశాల,ఈసాలతక్కళ్లపల్లి జేమ్స్‌మోడల్ పాఠశాల,పుట్నూర్‌లోని గ్లోబల్ పాఠశాలల్లో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించారు. కరస్పాండెంట్లు ఇస్మాయిల్,జాలపల్లి మహేష్,బుర్ర సత్యం గౌడ్ లు విద్యార్థులకు పండుగను వివరించారు. ప్రిన్సిపాల్‌లు సయ్యద్ అఫ్జల్, స్వప్న, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): హన్మంతునిపేట రాజేంద్రనగర్ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేశారు. పర్యావరణం రక్షించేందుకు పాటుపడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు దీప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా చాలెంజ్ హరిత సేనలో భాగంగా ఇన్‌చార్జి చెప్యాల రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో తహసీల్దార్ జగదీశ్వర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ శంకర్ మట్టి విత్తన గణపతిని బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ సభ్యుడు రాజేశ్వర్ రావు మాట్లాడుతూ మట్టి విత్తన గణపతులను పంపిణీ చేస్తున్నామన్నారు. మాజీ ఉపసర్పంచ్ సుదాటి కరుణాకర్ రావు, నూనేటి కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.



దుర్గయ్యపల్లి పాఠశాలలో వినాయకుల తయారీ

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానికులకు మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరు మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఆకుల శశికుమార్, నాయకులు మూకిరి రాజు, కుమార్‌గౌడ్, మారెపల్లి శ్రీనివాస్, మనోహర, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): పన్నూరులో మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ చిందం మహేష్, నాయకులు శ్రీనివాస్, సిద్దం మురళీ, కుంట శ్యాం, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను అందజేశారు. జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి ఆధ్వర్యంలో గణపతులను యేటా పంపిణీ చేస్తున్నారు. మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి, మండల అధ్యక్షుడు కొంద్ర వేణు,సభ్యులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ అన్నారు. మున్సిపాలిటీలో ఉచితంగా మట్టి విగ్రహాలను అందజేశారు. మేనేజర్ అలీమొద్దిన్, ఏఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. గట్టేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డాక్టర్ ఆరె సతీష్ అందించిన మట్టి విగ్రహాలను స్కూల్ పిల్లలకు పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు అన్నపూర్ణ, విజయేందర్ రెడ్డిలు పాల్గొన్నారు. గాంధీనగర్‌లో తుమ్మ రాజ్‌కుమార్ మట్టి విగ్రహాల పంపిణీ చేశారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి) : స్థానిక కృష్ణానగర్‌లో భగవతి యూత్ అధ్యక్షుడు కంకటి రవిగౌడ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. రవిగౌడ్, పైడ సాయి, వొల్లాల సురేష్, మామిడాల చంద్రయ్య, తిరుమల సురేందర్‌గౌడ్, పేరాల సాంబమూర్తి, పాల్గొన్నారు. దుర్గయ్యపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు అనిత ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేశారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ రామగుండం శ్రీకారం అధ్యక్షురాలు పోగుల వకుళ ఆధ్వర్యంలో బస్టాండ్ కాలనీలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. సునీత, ఉషశ్రీ, మంజుల, విజయ లక్ష్మి, వినోద, లత, జమున పాల్గొన్నారు.



కృష్ణవేణి పాఠశాలలో ముందస్తు వేడుకలు

మంథని, (ఆంధ్రజ్యోతి): మంథనిలోని చతుర్భుజ్ యూత్ అసోయేషన్ ఆధ్వర్యంలో స్థానిక పాత పెట్రోల్ పంపు వద్ద నుంచి డీజే సౌండ్స్ మధ్య ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో రంగురంగు లైట్ల డెకరేషన్‌తో వినాయక విగ్రహానికి స్వాగతం పలికారు. శ్రీపాద, అంబేద్కర్, గాంధీ చౌక్‌ల, డిష్ ఏరియా మీదుగా శ్రీలక్ష్మినారాయణస్వామి టెంపుల్ సమీపంలో ఏర్పాటు చేసిన మండపంలోకి చేర్చారు.

సంప్రదాయంగా నిర్వహించుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): భక్తులు వినాయక నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయంగా నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ జగన్నాథాచార్యులు సూచించారు. మంగళవారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిది రోజులపాటు భక్తిభావం పెంపొందించేలా నిర్వాహకులు జాగ్రత్త వహించాలన్నారు. సెప్టెంబరు 5న నిమజ్జనం ఉంటుందని, నిర్వాహకులు ఉత్సవసమితికి మండపాల వివరాలను తెలియపరచాలని జగన్నాథాచార్యులు సూచించారు. ఆధ్యాత్మిక భావన పెంపొందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దావరాజిరెడ్డి, బాలయ్య, మూకిరి రాజు, వేణుగోపాల్‌రావు, లింగంనాయక్, నర్సయ్య పాల్గొన్నారు.

మండపాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వినాయక చవితి, ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను దృష్టిలో పెట్టుకుని కార్య దర్శులు, అధికారులు, సిబ్బందితో ఎంపీడీఓ భాస్కర్ రావు సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుం డా చూసుకోవాలని తెలిపారు. వచ్చే నెల 5న మిలాన్ ఉన్ నబీ ఉంటుందన్నారు. తహసీల్దార్ యాకయ్య, ఎస్ఐ సత్యానారాయణ, ఏపీఓ సదానందం, విద్యుత్ ఏఈ సంపత్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

మంథని, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణపతి మండపాల వద్ద నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఏసీపీ మడత రమేష్ సూచించారు. సీఐ రాజు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవటానికి నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. విగ్రహాల ఏర్పాటు ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలన్నారు. ప్రతి ఒక్కరు పోలీసు, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. రాత్రి 10 గంటల తర్వాత మైక్‌లు వాడొద్దని, సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలపాలకు దూరంగా ఉండాలన్నారు. ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కుమారస్వామి, కమిషనర్ వెంకన్న, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

కొలువుదీరనున్న ఆదిదేవుడు

(5వ పేజీ తరువాయి)

హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రకృతి పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మట్టి వినాయకులను పూజించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయకులను పంపిణీ చేయాలని వాటి అవశ్యకత ప్రజలకు వివరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప,మాజీ కౌన్సిలర్లు,మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగాలకు భరోసా టామ్ కామ్

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విదేశాలలో ఉపాధికి భరోసాగా టామ్‌కామ్ పని చేస్తుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. టామ్‌కామ్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిందని, దీని ద్వారా పలు దేశాలలో సరైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విదేశీ నియామకదారులతో అనుసంధానం చేసి అవసరమైన డాక్యుమెంటేషన్, ప్లేస్‌మెంట్, శిక్షణ కల్పిస్తుందన్నారు. అక్కడ వచ్చే ఆదాయం, విద్యార్హతలు, వసతి, వివరాలు అభ్యర్థులు తెలుసుకోవాలని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం పలు దేశాల్లో వార్షిక ప్యాకేజీలతో పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చే ఉద్యోగాలు ఉన్నాయని వివరించారు. ఆసక్తిగల యువతీ, యువకులు బయోడేటా టామ్‌కామ్ సంస్థకు పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవా లన్నారు. అలాగే డాక్యుమెంటేషన్, ప్లేస్‌మెంట్, శిక్షణకు అవసరమయ్యే ఖర్చులో 20 శాతం వరకు జిల్లా యంత్రాంగం నుంచి సబ్సిడీగా అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. టామ్‌కామ్ మేనేజర్ షబ్నా, జిల్లా ఉపాధి అధికారి తిరుపతిరావు, జిల్లా పరిశ్రమల అధికారి కీర్తికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ హోంగార్డుపై కేసు నమోదు

కోల్‌సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కోర్టు కాంప్లెక్స్‌లో మంగళవారం విచారణ సందర్భంగా అనుచితంగా ప్రవర్తించిన మాజీ మహిళా హోంగార్డు పద్మపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. గోదావరిఖని కోర్టులో ఒక కేసు విచారణ జరుగుతుండగా కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో పద్మ ఆందోళన చేస్తుందనే సమాచారంతో కానిస్టేబుల్ ప్రవళిక, ఎస్ఐ అనూష తదితరులు అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె కానిస్టేబుల్ ప్రవళిక విధులకు ఆటంకం కలిగించేలా ఆమెపై దాడి చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. ఎస్ఐ అనూష ఫిర్యాదు మేరకు మాజీ హోంగార్డు పద్మపై కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

సుల్తానాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని బీజేపీ నేతలు అందోళన చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, జిల్లా కార్యదర్శి సౌదరి మహేందర్ యాదవ్, కార్యకర్తలు నాయకులు ఆందోళనం చేశారు. గ్రామాలలో పాలన లేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విష జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నా పాలకులు అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ మేరకు పలు సమస్యలు ప్రస్థావిస్తూ తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. కొమ్ము తిరుపతి, లంక శంకర్, వేగోళం శ్రీనివాస్, పెరుక రమేష్, సదయ్య గౌడ్, గుడ్ల వెంకటేశ్, చిట్టవేని సదయ్య, కోట నాగేశ్వర్, శేఖర్, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్ రావు అన్నారు. మంగళవారం ఉల్లాస్ మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఎంఈఓ కార్యాలయంలో జరిగింది. సంపూర్ణ అక్షరాస్యతను సాధించడానికి ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని మొదలు పెట్టిందన్నారు. ఎంఈఓ మహేష్, జిల్లా స్థాయి శిక్షకులు, ఆర్పీలు అత్తె రాజారాం, పులి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, వీఓఏలు పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం ఎంఈఓ రమేష్ అధ్యక్షతన విద్య బోధన పై సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్సి సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): నవ భారత్ సాక్షరతా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య తెలిపారు. గర్రెపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు శిక్షణా నిర్వహించారు. హెచ్‌ఎం కవిత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోల్డీ బల్బీర్ కౌర్, పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యా జీపీ రిసోర్స్ పర్సన్‌లకు సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యాధికారి నరేంద్ర చారి వీఏఓలు పాల్గొన్నారని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గంద్ర దేవేందర్ రావు, ధూళికట్ట హెచ్‌ఎం బిజిలి సదయ్య, పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఈవో ప్రభాకర్ ప్రారంభించగా, రిసోర్స్‌పర్సన్స్ గంగారెడ్డి, నరేష్ లు ఉపాధ్యాయులతోపాటు విలేజ్ అర్గనైజర్ అసిస్టెంట్స్‌కు శిక్షణ ఇచ్చారు.

చదువు కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలి

రామగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చదువును కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలని ఏసీపీ మడత రమేశ్ అన్నారు. మంగళవారం బేగంపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఏసిపి రీడింగ్ చైర్స్, రైటింగ్ ప్యాడ్స్, టెబుల్ ల్యాంప్స్ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రతిభవంతమైన ఉపాధ్యాయులు ఉంటారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు రామ్‌కిషన్‌రావు, స్థానిక నాయకులు దాసరి శివ, సంజీవ్, విద్యార్థుల కుటుంబ సభ్యులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రపంచ క్రీడావేదికపై తెలంగాణ ఖ్యాతిని నిలిపిన చికిత

ఎలిగేడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యువఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తానిపర్తిచికిత బంగారు పతకాన్నిసాధించి ప్రపంచ క్రీడావేదికపై భారతదేశ ప్రతిష్టను, తెలంగాణ ఖ్యాతిని నిలపడం హర్షణీయమని పలువురు ఎక్స్‌వేదికగా అభినందనలు తెలిపారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత ప్రపంచస్థాయి పోటీల్లో దేశానికి మొట్టమొదటి బంగారు పతకాన్ని అందించి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జాగృతి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించి మనందరికీ గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

కమాన్‌పూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ పిలుపునిచ్చారు. పెంచికల్‌పేటలో మంగళవారం బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆవిర్భవించాక పదేళ్ల కాలంపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. నాయకులు కొట్టె భూమయ్య, బొమ్మగాని అనిల్ గౌడ్, గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, ఎద్దు రాజయ్య, బైరి అంజయ్య గౌడ్, పల్లి నారాయణ, ఐటవేన ఐలయ్య, చిందం తిరుపతి, కొయ్యడ రవి, పోలుదాసరి సాయికుమార్, పెండ్లి నారాయణ, సుధాకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భగా గ్రామానికి చెందిన కొలిపాక పర్వతాలును మండల కన్వీనర్ శంకర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఆకట్టుకున్న రెడ్ కలర్స్ డే



గుడ్‌మార్నింగ్ పాఠశాలలో రెడ్ కలర్స్ డే వేడుకలు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చంద్రశేఖర్‌నగర్‌లోని గుడ్ మార్నింగ్ గ్రామర్ స్కూల్‌లో మంగళవారం రెడ్ కలర్స్ డే ఆకట్టుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు రెడ్‌కలర్ దుస్తులు ధరించారు. ఎర్రని పువ్వులు, పండ్లు, వివిధ వస్తువులతో ఆకట్టుకున్నారు. వినాయక చవితి సందర్భంగా పాఠశాల ఆవరణలో మట్టి వినాయకులను ప్రతిమలను తయారు చేసి అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ ఆదర్సండే సమ్మారావు, ప్రిన్సిపాల్ చందుపట్ల తిరుపతిరెడ్డి, డైరెక్టర్ ఊర సమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భట్టుపల్లిలో జాతీయ గణాంకాల సర్వే

మంథనిరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భట్టుపల్లిలో మంగళవారం జాతీయ గణాంకాల అధికారులు సర్వే నిర్వహించారు. వ్యవసాయేతర రంగంలోని చిన్న వ్యాపా ాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. అధికారులు శ్రీగోవర్ధన శ్రీనివాసరావు, గుర్ర శ్రీనివాస్, కొటం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సుల్తానాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ న్యాయవాది తస్నీరు శ్రీకాంత్ పై జరిగిన దాడికి నిరసనగా సుల్తానాబాద్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదులు మాట్లాడుతు శ్రీకాంత్ పై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. బార్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, న్యాయవాదులు లక్ష్మీకాంత రెడ్డి, ఆవుల లక్ష్మీరాజం, శ్రీనివాసరావు, అంజనేయులు, జోగుల రమేష్,నర్సయ్య, రాజేంద్ర ప్రసాద్. పడాల శ్రీరాములు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

మంథని, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీలో భాగంగా మంథని పోలీస్‌స్టేషన్‌ను గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్‌నిర్వహణ, సిబ్బంది పని తీరు, ఫైల్స్ రికార్డులను ఏసీపీ పరిశీలించారు. సిబ్బందితో డ్యూటీ నిర్వహణ పై మాట్లాడారు. వివిధ కేసుల్లో స్టేషన్ వచ్చే బాధితులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ పాల్గొన్నారు.



ఆర్జీ-2లో క్వార్టర్ల కౌన్సెలింగ్

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా, ఏఎల్పీ ఏరియా ఉద్యోగుల్లో క్వార్టర్లు లేని ఉద్యోగులకు సెక్టార్-3 కాలనీలో క్వార్టర్‌ల కేటాయించేందుకు మంగళవారం సీఈఆర్ క్లబ్‌లో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. క్వార్టర్లు లేని వారికి, చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కోసం చేపట్టారు. 965 క్వార్టర్లకు గాను 76 మంది దరఖాస్తు చేసుకోగా 32 మంది హాజరయ్యారు. వారిలో 16 మందికి డీజీఎం పర్సనల్ అరవిందరావు క్వార్టర్‌లను కేటాయిస్తూ లెటర్లు అందజేశారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత, డీవైపీఎం వేణుగోపాల్, సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, క్వార్టర్ సెక్షన్ ఇంచార్జి మమత పాల్గొన్నారు.

సీబీఎస్ఈ స్కూల్ సమస్యలను పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి స్కూల్‌లో ప్రవేశపెట్టిన సీబీఎస్ఈ సిలబస్‌కు సంబంధించి సమస్యలను పరిష్కరించాలని మంగళవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డీజీఎం అరవిందరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. నాలుగు బస్సులను నడపాల్సి ఉండగా ఒక బస్సు నడిపిస్తున్నట్టు యూనియన్ బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ పేర్కొన్నారు. పాఠశాలలో వసతి సౌకర్యాల కొరత ఉన్నదని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని యాజమాన్యం గుర్తించాలని ప్రవీణ్ కోరారు. సోమారపు వెంకన్న, విజయ్‌కుమార్‌రెడ్డితో పాటు పోషకులు ఉన్నారు.

ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులతో సమావేశం

రామగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో మంగళవారం ప్రాతినిధ్యసంఘం నాయకులతో జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు సమావేశం నిర్వహించారు. సెంటినరీకాలనీలోని సమస్యల పరిష్కారం పై చర్చించారు. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోటరవీందర్‌రెడ్డి, నాయకులు గడ్డం తిరుపతి, సాయికృష్ణ, అధికారులు శేఖరబాబు, రామ్మోహన్, బండి సత్యనారాయణ, సిహెచ్ వెంకటరమణ, రాజశేఖర్, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

ఏడు కొత్త బొగ్గు బ్లాకులు సింగరేణికే వస్తాయి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రాంతంలో కొత్తగా రానున్న ఏడు బొగ్గు బ్లాకులు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణి దక్కించుకునేలా చూస్తామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ దీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి పరిధిలో ఉన్న కొత్తగూడెం ఓసీపీ-3, వెంకటాపూర్ బ్లాక్-2, వీకే ఓసీ, తాడిచర్ల ఓసీ-2, శ్రావణపల్లి ఓసీ, సత్తుపల్లి బ్లాక్-3, చెన్నూరు సౌత్ బ్లాక్ ప్రాజెక్టులన్నీ సింగరేణి దక్కేలా ప్రయత్నిస్తామన్నారు. సింగరేణిలో విస్తరణ కావాల్సిన వీకే ఓసీపీ, జేకే ఓసీ, రామగుండం మెగా ఓసీ, గోలేటి ఓసీ, ఎంవీకే ఓసీ, కొత్తగూడె ఓసీ-1 అండర్ గ్రౌండ్ సెక్షన్‌సెఎన్, పీవీ నర్సింహారావు ఓసీ, జీడీకే 11ఓసీ, ఆర్‌కే-7ఓసీ, కేకే-1, కేకే-5 ఓసీ, ఆర్-5, ఆర్‌కే-6 ఓసీ విస్తరణలను కూడా సింగరేణి యాజమాన్యం త్వరగా చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ ఎన్నికల సందర్భంలో సింగరేణి, సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం సంస్థ లాభాల్లో కార్మికుల వాటాను 35శాతం డిమాండ్ చేస్తున్నామని, దసరాకు 20రోజుల ముందే లాభాల వాటా ఇప్పిస్తామని జనక్ ప్రసాద్ చెప్పారు. విలేకరుల సమావేశంలో కేంద్ర కమిటీ నాయకులు లక్ష్మీపతిగౌడ్, కచ్చకాయల సదానందం, వడ్డేపల్లి దాస్, కృష్ణ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

రామగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మట్టి విగ్రహలనే పూజించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం కార్యాలయం ఆవరణలో ఉచితంగా విగ్రహలను పంపిణీ చేశారు. ఆర్జీ-3, ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, పరిసర గ్రామాల ప్రజలకు సామాజిక బాధ్యతతో పాటు పర్యావరణ హితం కోసం మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. నాయకులు రామచంద్రరెడ్డి, కొటరవీందర్ రెడ్డి, అధికారులు సిహెచ్. వెంకటరమణ, రామ్మోహన్, సత్యనారయణ, కిషన్, సుదర్శనం, వివిధ విభాగాల స్టాఫ్ పాల్గొన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. ఇన్‌చార్జి జీఎం చిలక శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఎస్ఓటూ జీఎం, ఎన్విరాన్మెంట్ అధికారి అంజనేయ ప్రసాద్, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు, సీఎంఓఏఐ ప్రతినిధి క్రాంతి కుమార్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ప్రాజెక్ట్ అధికారి రమేష్, డీవైపీఎం వేణు, పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ కోశాధికారిగా చెల్పూరి సతీష్

గోదావరిఖని, ఆగస్టు 26(ఆంధజ్యోతి): తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కోశాధికారిగా చెల్పూరి సతీష్‌ను నియమిస్తూ మంగళవారం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. 20ఏళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీలో పని చేస్తున్న సతీష్ టీబీజీకేఎస్ కార్మిక సంఘంలో క్రియాశీలకంగా పని చేస్తున్నాడు. ఆయన మాట్లాడుతూ టీబీజీకేఎస్ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని, నియామకానికి కృషి చేసిన గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, కాపు కృష్ణ, సురేందర్‌రెడ్డి, వడ్డేపల్లి శంకర్, పర్లపల్లి రవికి కృతజ్ఞతలు తెలిపారు.

కారుణ్య నియామకాల ఎత్తివేతకు కుట్ర

రామగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కారుణ్య నియామకాల ఎత్తివేతకు ఏఐటీయుసీ, ఐఎన్‌టీయుసి సంఘాలు కుట్రలు చేస్తున్నాయని ఆర్జీ-3 టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య ఆరోపించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలోనూ డిపెండెంట్ ఉద్యోగాలను తొలగించిన ఘనత వీరికే దక్కిందన్నారు. కేసీఆర్ బాధ్యతలు చేపట్టగానే సింగరేణిలో కారుణ్యనియమాకాలను అమలు చేశారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారించాలనే ప్రధాన డిమాండ్ల పై ఈ నెల 28 నుంచి ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు దేవశ్రీనివాస్, పూర్ణాకర్, గొర్రెక్రాంతి పాల్గొన్నారు.